మాట్లాడుతున్న ఎస్పీ సిద్దార్థ కౌశల్



అల్లర్లకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తాం

- కౌంటింగ్‌రోజున పటిష్ట బందోబస్తుకు ఏర్పాట్లు
- ఎస్పీ సిద్దార్థకౌశల్

కడప (క్రైం), మే 18: ఎన్నికల కౌంటింగ్ రోజు ఎవరైనా అల్లర్లకు పాల్పడితే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ సిద్దార్థకౌశల్ స్పష్టం చేశారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో ప్రజలు సహకారం అందించాలని, అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా పూర్తిగా పోలీసు అధికారులకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. జూన్ 4న కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో ఎస్పీ శనివారం స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో పోలీసు అధికారులతో సూక్ష్మ స్థాయిలో సమీక్ష నిర్వహించి దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ నేపథ్యంలో జూన్ 1 నుంచి 6 వరకు ఎలాంటి ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టరు రాజు, వన్‌టౌన్ సీఐ భాస్కరరెడ్డి, నగరంలోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు. గౌస్‌నగర్ ఘటనకు సంబంధించి ఒక సీఐతో పాటు, ఐదు మంది ఎస్‌ఐలు, సిబ్బందికి చార్జిమెమోలు ఇచ్చినట్లు సమాచారం.

కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు

- జూన్ 4వ తేదీ వరకు ఆంక్షలు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్) మే 18: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. 2024 ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం జిల్లా కేంద్రంలోని మౌలానా అబుల్ కలాం అజాద్ ఉర్దూ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను మూడంచెల భద్రత నడుమ అత్యంత జాగ్రత్తగా భద్రపరిచినట్లు వెల్లడించారు. 24 గంటలూ ప్రత్యేక బలగాల నిఘా ఏర్పాటు చేశామన్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కౌంటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రశాంతతకు భంగం కలిగించే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా సహేతకమైన ఆంక్షలను అమలు చేయడం అత్యవసర మైందన్నారు. అందులో భాగంగానే కౌంటింగ్ కేంద్రం వద్ద 200 మీటర్ల రేడియస్ పరిధిలో క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973లోని 144 సెక్షన్ అమలులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ నెల 18వ తేది నుంచి జూన్ 4 వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించే ఏ వ్యక్తినైనా ఐపీసీ సెక్షన్ 188 నిబంధనల ప్రకారం శిక్షార్హులని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ

కడప (క్రైం), మే 18: కడప నగరం రిమ్స్ సమీపంలోని ఉర్దూ నేషనల్ యూనివర్సిటీ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ సిద్దార్థ్‌కౌశల్, జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమలులో ఉందని నలుగురి కంటే ఎక్కువ వుండకుండా చర్యలు తీసుకోవాలని, నిరంతరం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిఘా కెమెరాలతో పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ క్రిష్టారావు, కడప డీఎస్పీ షరీఫ్, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, సీఐ రామచంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యంతర ఉత్తర్వులు హర్షణీయం : తులసిరెడ్డి

వేంపల్లె, మే 18: వివేకానందరెడ్డి హత్యకేసుపై మాట్లాడవద్దంటూ కడప జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాను పేదల పక్షం, పేదల ప్రతినిధిని అని ఒక వైపు చెప్పుకొంటూ మరోవైపు సీఎం జగన్.. కుటుంబ సభ్యులతో స్పెషల్ లగ్జరీ విమానంలో విదేశాలకు విహారయాత్రకు వెళ్లడం విడ్డూరంగా ఉందని, ఇది జగన్ ద్వంద్వనీతికి నిదర్శనమన్నారు. 75ఏళ్ల దాటినవారు ప్రత్యక్ష క్రియాశీలక రాజకీయాల్లో ఉండకూడదనేది బీజేపీ విధానమని ఆ పార్టీ నేతలు పదేపదే చెబుతుంటారని, ఈ కారణంగా అద్వానీని, మురళీమనోహర్‌జోషిని క్రియాశీల రాజకీయాలకు దూరంగా పెట్టారన్నారు. కానీ 2024లో బీజేపీ అధికారంలోకి వస్తే నరేంద్రమోదీనే ప్రధానమంత్రిగా ఉంటారని అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్ తదితర బీజేపీ నేతలు వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ, టీడీపీ కూటమి అభ్యర్థులు రూ.20కోట్ల నుంచి రూ.40కోట్లు ఖర్చు చేశారని, దీన్ని అరికట్టడంలో ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైందన్నారు. డబ్బులేని పార్టీలు, డబ్బులేని నేతలు పోటీచేసే పరిస్థితి లేదని, ప్రజాస్వామ్యం స్థానంలో ధనస్వామ్యం చోటుచేసుకోవడం దురదృష్టకరమని తులసిరెడ్డి పేర్కొన్నారు.



ఓటుకు దూరంగా.. 3.38 లక్షల మంది ఓటర్లు

- ప్రతి ఎన్నికల్లోనూ ఇదే తంతు
- ఉమ్మడి జిల్లాలో 2014, 2019 ఎన్నికల్లోనూ ఐదు లక్షల మంది ఓటర్లు దూరం

(కడప-ఆంధ్రజ్యోతి): ఓటు వజ్రాయుధం లాంటిది. మనల్ని ఐదేళ్లు పాలించే ప్రజాప్రతినిధిని ఎన్నుకునే బ్రహ్మాస్త్రం లాంటిది. నేర ప్రవర్తులు, అవినీతిపరులు చట్టసభలకు వెళ్లకుండా నిజాయితీపరులను ఓటు ద్వారా ఎన్నుకునే వీలుంటుంది. ప్రజాస్వామ్యదేశంలో ఓటు చాలా కీలకమైనందున ఓటుహక్కు వినియోగం కోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పించి.. ఓటు వేయాలని చెప్పినా కొంతమంది ఓటు హక్కు వినియోగానికి దూరంగా ఉన్నారు. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో 3,38,681 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల విషయానికి వస్తే ఐదు లక్షల పైచిలుకు మంది ఓటు హక్కును వినియోగించుకోలేక పోయారు. దశాబ్దకాలంగా ఓటు హక్కు వినియోగంపై విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నప్పటికీ కొంతమంది ఓటర్లలో మార్పు రాక పోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇది ప్రజాస్వామ్యానికే చేటు అని పలువురు ఆందోళన చెందుతున్నారు.

2014, 2019 ఎన్నికల్లో కూడా ఇంతే

ఉమ్మడి కడప జిల్లాలో 2014 సార్వత్రిక ఎన్నికల్లో 5,02,932 మంది ఓటు హక్కు వినియోగించుకోలేదు. అంటే అప్పటి ఓటర్లలో (23.26) శాతం దూరంగా ఉన్నారు. ఇక 2019లో 22,04,964 ఓటర్లు ఉండగా, అందులో 5,01,983 మంది (22.75 శాతం) ఓటుకు దూరంగా ఉన్నారు.

ఇప్పుడూ ఇంతే

ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికలు మన తలరాతలను మారుస్తాయి. అంత ముఖ్యమైన ఎన్నికల పట్ల కొందరు అనాసక్తి చూపిస్తున్నారు. బతుకుదెరువు కోసమో, ఏదో పొరుగు రాష్ట్రాల్లో ఉన్న వారిని ఎన్నికల సమయంలో రవాణా సౌకర్యం కల్పించినప్పటికీ కొందరు రాలేకపోతున్నారు. మరికొంతమంది ఓటింగ్‌లో పాల్గొనకుండా ఉన్నారు. సెలవు ఇచ్చినా కూడా ఓటు వేయడానికి ఆసక్తి చూపడం లేదు. వెరశి ప్రతిసారి ఓటు వేయని వారి సంఖ్య ఎక్కువవుతోంది.

ఈసారి కూడా 3 లక్షల మందికి పైగా దూరం

ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో 3,38,681 మంది ఓటుహక్కు వినియోగించుకోలేదు. వీరిలో కొంతమంది చనిపోయిన వారుకూడా ఉండొచ్చు. ఈసారి ఓటుపై విస్తృత ప్రచారం నిర్వహించినప్పటికీ ఓటుకు దూరంగా ఉన్నారు. ఇటీవల కాలంలో ఓటుకు నోటు పంచడం సర్వసాధారణంగా మారింది. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, ధనవంతులు కూడా డబ్బులు తీసుకుంటున్నారు. డబ్బులు తీసుకోవడం హక్కుగా మారింది. మాకు డబ్బులు పంచలేదంటూ మరికొందరు ఓటర్లు ఫోను చేసి డబ్బులు ఇప్పించుకున్నారు. అయినప్పటికీ ఓటుకు రాకుండా మిన్నకుండిపోయారు. మరికొందరు తమకు డబ్బులు పంచలేదని అలకబూని ఓటింగ్‌కు రాలేదు.

జిల్లాలో 16,39,066 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో కడప నియోజకవర్గంలో మొత్తం 2,88,543 ఓట్లు ఉండగా.. 1,85,079 ఓట్లు మాత్రం పోలయ్యాయి. 98,406 మంది ఓటింగ్‌కు రాలేదు. ఇందులో పురుషులు 49,764 కాగా, స్త్రీలు 48,642 మంది ఉన్నారు. ప్రొద్దుటూరులో 2,47,960 ఓట్లు ఉండగా, 1,97,349 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ 50,596 మంది ఓటు హక్కుకు దూరంగా ఉన్నారు. 24,725 మంది పురుషులు, 25,871 మంది మహిళలు ఓటుకు దూరంగా ఉన్నారు. బద్వేలులో 2,19,291 ఓట్లకు గాను 1,72,660 ఓట్లు పోలయ్యాయి. 46,627 మంది ఓటు హక్కుకు దూరంగా ఉన్నారు. ఇందులో 24,677 మంది పురుషులు, 21,955 మంది మహిళలు ఉన్నారు. జమ్మలమడుగులో 2,42,556 ఓట్లు ఉన్నాయి. 2,10,241 ఓట్లు పోలయ్యాయి. 32,303 మంది ఓటు వేయలేదు. 14,957 మంది పురుషులు, 17,346 మంది మహిళలు ఓటుకు దూరంగా ఉన్నారు. ఇక సీఎం జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో 2,29,687 ఓట్లు ఉన్నాయి. 1,86,834 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 42,840 మంది ఓటు వేయలేదు. ఇందులో పురుషులు 20,243, స్త్రీలు 22,601 మంది దూరంగా ఉన్నారు. కమలాపురంలో 2,04,159 ఓట్లు ఉండగా, 1,72,401 ఓట్లు పోలయ్యాయి. 35,746 మంది ఓటు వేయలేదు. వీరిలో 19,934 మంది పురుషులు, 15,812 మంది స్త్రీలు ఉన్నారు. మైదుకూరులో 2,11,855 ఓట్లకు గాను 1,79,692 ఓట్లు పోలయ్యాయి. 32,159 మంది ఓటు వేయలేదు. ఇక్కడ 16,213 మంది పురుషులు, స్త్రీలు 15946 మంది ఓటు వినియోగించుకోలేదు.

నేటి నుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు



- ముస్తాబైన పెంచలకోన
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- వివిధ జిల్లాల నుంచి 120 ప్రత్యేక బస్సులు
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు

రాపూరు (డక్కిలి), మే 18: రాపూరు మండలంలోని పెంచలకోనలో ఆదివారం నుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు పెంచలకోన ముస్తాబైంది. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉప కమిషనర్ సాగర్‌బాబు, ఆర్డీవో మాలోల తదితరులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం గోనుపల్లి నుంచి శోభాయాత్రగా పెంచలకోనకు ఉత్సవమూర్తులు రానున్నారు. అనంతరం అంకురార్పణ, రాత్రి సేనాపతి ఉత్సవం నిర్వహిస్తారు. 20వ తేదీ ఉదయం స్వామివారికి పట్టువస్త్రాల సమర్పణ, ధ్వజారోహణ, రాత్రికి శేషవాహన సేవ, 21న ఉదయం హంస వాహనసేవ, రాత్రికి బంగారు హనుమంత సేవ, 22న ఉదయం సింహ వాహన సేవ, రాత్రికి నృసింహ జయంతి సందర్భంగా బంగారు గరుడసేవ నిర్వహిస్తారు. 23న ఉదయం తిరుకల్యాణం, సాయంత్రం రథోత్సవం, రాత్రికి గజవాహనసేవ జరుగుతాయి. 24న ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, సాయంత్రం తెప్పోత్సవం, రాత్రికి అశ్వవాహనసేవ, ధ్వజావరోహణం, 25న ఉదయం కోన నుంచి గోనుపల్లికి ఉత్సవమూర్తుల తిరుగు ప్రయాణం, రాత్రికి గ్రామోత్సవం జరుగుతాయి.

> **కోనలో వసతుల మెరుగు..**
>
> కోనలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ ఉప కమిషనర్ సాగర్ బాబు తెలిపారు. సామాన్య భక్తులు స్వామి వారిని సులభంగా, త్వరితగతిన దర్శించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. ఇందుకోసం ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని, ఎండకు భక్తులు ఇబ్బంది పడకుండా చలవ పందిళ్లు వేశామని ఆయన వివరించారు. భక్తులకు తాగునీటి వసతి కూడా కల్పించామని చెప్పారు.
>
> - ఆలయ ఉపకమిషనర్ సాగర్‌బాబు

పటిష్ట పోలీసు బందోబస్తు

బ్రహ్మోత్సవాలకు లక్షలాదిమంది భక్తులు తరలివస్తారని అంచనా. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి పర్యవేక్షణలో రాపూరు, సంగం, ఆత్మకూరు సీఐలతో పాటు 10మంది ఎస్‌ఐలు, మహిళా పోలీసులు, హోంగార్డులు, ప్రత్యేక పోలీసులు మొత్తం 250మంది వరకు బందోబస్తు నిర్వహిస్తారని రాపూరు ఎస్‌ఐ మాలాద్రి తెలిపారు.

భక్తుల కోసం 120 ఆర్టీసీ బస్సులు

కోన ఉత్సవాలకు నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, కడప, తిరుపతి జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలిరానున్నారు. దీంతో ఆయా ప్రాంతాల నుంచి సుమారు 120 బస్సులు నడుపుతున్నట్లు రాపూరు ఆర్టీసీ డిపో మేనేజరు అనిల్‌కుమార్ తెలిపారు. అవసరమైతే బస్సుల సంఖ్యను పెంచుతామన్నారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.


ఉత్సవాలకు ప్రచారమేది ?

ప్రతి ఏటా కోన బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నలు మూలల నుంచి భారీగా భక్తులు తరలివస్తారు. అయితే ఈ ఏడాది అందుకు తగ్గట్టుగా ప్రచారం చేయడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఉత్సవాలకు పదిరోజుల ముందు నుంచే వాల్‌పోస్టర్లను వివిధ డిపోల బస్సులకు అంటిస్తారు. కానీ ఈసారి అలాంటి ఏర్పాట్లు చేయలేదు. ఉత్సవాలకు భారీగా ఆదాయం వస్తున్నా నామమాత్రంగా ప్రచారం కల్పించారనే విమర్శలు ఉన్నాయి.

పట్టువస్త్రాలు ఎవరు సమర్పిస్తారు ?

స్వామివారికి గరుడసేవ రోజున స్థానిక ఎమ్మెల్యే పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. అయితే ఈసారి బ్రహ్మోత్సవాలు జరిగే సమయానికి ఎన్నికల ఫలితాల కోసం నేతలు ఎదురు చూస్తున్నారు. అంతేకాక కోడ్ అమలులో ఉంది. ఈ పరిస్థితుల కారణంగా ఈ ఆనవాయితీ కొనసాగుతుందా.. లేదా? అన్నది అంతుబట్టడం లేదు. ఇక శ్రీవారి కల్యాణం రోజున ముత్యాల తలంబ్రాలను గతంలో ఆలయ ఛైర్మన్ సమర్పించేవారు. కానీ ఈసారి ఆలయ పాలక మండలి పదవీకాలం పూర్తయింది. కొత్త పాలకమండలి ఏర్పాటు కాలేదు. దీంతో స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు అందచేసే సంప్రదాయం ఉంటుందా... ఉండదా..? అని భక్తులు సందేహిస్తున్నారు.

పెంచలకోనలోని నృసింహుడి ఆలయం



నత్తే నయం..!

- ముందుకు సాగని పేదల ఇంటి నిర్మాణాలు
- లక్ష ఇళ్లు మంజూరు
- 31 వేలు పూర్తి
- 45 వేల ఇళ్లు పునాదులకే పరిమితం



పులివెందులలో స్లాబు పడని జగనన్న కాలనీ

కడప(ఎన్టీఆర్ సర్కిల్), మే 18: పేదల పక్కాగృహాల నిర్మాణం నత్తను మరిపిస్తోంది. నిరుపేదల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం శాశ్వత గృహాల మంజూరుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగానే ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద జిల్లాకు లక్ష 128 మంజూరు చేశారు. వీటిని నవరత్నాల్లో భాగంగా రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం నిరుపేదలందరికీ పక్కాగృహాలు మంజూరు చేస్తున్నామంటూ నానా యాగీ చేశారు. అంతేకాకుండా ఆయన బొమ్మతో ఇళ్లస్థలాలను మంజూరు చేస్తూ పత్రాలను పంపిణీ చేశారు. అంతటితో ఆగకుండా జగనన్న కాలనీలు అంటూ బిల్డప్ ఇచ్చారు. 97,139 మందికి పక్కాగృహాల స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు. కానీ గత ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తుందని వాగ్దానం చేశారు. గద్దెను ఎక్కిన తరువాత ఆ మాటే మరిచారు. జిల్లాలో 436 లేఅవుట్‌లను అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కానీ మౌలిక వసతుల కల్పన అంతంత మాత్రం ఉండడం, నిర్మాణానికి అవసరమైన నీటివసతి కూడా అందుబాటులో లేకపోవడంతో గృహ నిర్మాణాలు ఆలస్యంగా సాగుతున్నాయి.

లక్ష ఇళ్లకు 31 వేలు పూర్తి

జిల్లాకు 1,00,128 పక్కాగృహాలు మంజూరు కాగా, కేవలం 31,164 గృహాలు నిర్మాణం పూర్తయ్యాయి. మరో 10,854 గృహాలు రూఫ్ లెవల్, 8,924 గృహాలు రూఫ్ కాస్ట్ స్టేజీలో ఉన్నాయి. ఒక్కో గృహం పూర్తి కావాలంటే ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయంతో పాటు మరో లక్షకు పైగా అప్పు చేయాల్సిన పరిస్థితి ఉంది. దీంతో పేదవారికి సొంతింటి కల నెరవేరడం భారంగా మారుతుంది. ఒక పక్కన ఇసుక కొరత వేధిస్తుండగా మరో వైపు భవన నిర్మాణ కూలీల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం రుణ సదుపాయాలు కల్పించినప్పటికీ లబ్ధిదారులు ఇళ్లనిర్మాణం పూర్తి చేసేందుకు సిద్ధంగా లేరనిపిస్తోంది. ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పి... ఇప్పుడు మాట తప్పింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటి నిర్మాణం సాధ్యం కాదనే ఆలోచనతో లబ్ధిదారులు వెనకడుగు వేస్తున్న పరిస్థితి జిల్లాలో కనిపిస్తుంది.

50 వేల గృహాలు పునాదుల్లోనే

జిల్లాకు మంజూరైన పక్కాగృహాల్లో సగం వరకు పునాదులకే పరిమితమయ్యాయి. 660 గృహాల నిర్మాణం మొదలు కాలేదు. ఇందులో 434 గృహాలు సీఎం ప్రాతినిధ్యం వహించే పులివెందుల నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఇదే నియోజకరవ్గం-బిలో బెస్మెంట్ లెవెల్‌లో 2253 ఉండగా బేస్‌మెంటు లెవల్‌లో 3568 ఉన్నాయి. బద్వేలు నియోజకవర్గంలో 96 గృహాల నిర్మాణం ప్రారంభం కాలేదు. 3156 గృహాలు పునాదులకే పరిమితమయ్యాయి. మైదుకూరు నియోజకవర్గంలో 1750కి పైగా పునాదుల్లోనే ఉన్నాయి. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 14 వేలకు పైగా బేస్‌మెంటు లెవల్‌లో ఉన్నాయి జమ్మలమడుగు నియోజకవర్గంలో 3600 బేస్‌మెంటు లెవల్‌లో ఉన్నాయి. కమలాపురం నియోజకవర్గంలో 1200 పైచిలకు పక్కాగృహాలు పునాదులకే పరిమితమయ్యాయి. కడప నగరంలో 15వేల గృహాలు పునాదుల స్థాయిలో ఉన్నాయి. రాజంపేట నియోజకవర్గ పరిధిలోని ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల్లో 500కు పైగా పక్కాగృహాలు పునాదులకే పరిమితమయ్యాయి. దాదాపు 50 వేల పక్కాగృహాలు పునాదులకే పరిమితం కావడంతో జిల్లా అధికార యంత్రాంగం వత్తిడి ఎక్కువగా ఉండేది. ఈ వత్తిడితోనే 45 వేల పైచిలుకు పునాదులు పడ్డట్లు తెలుస్తోంది. ఓట్ల లెక్కింపు తరువాత ప్రభుత్వాలు మారితే పక్కా గృహాలకు ఇచ్చే ఆర్థిక సాయం మరింత పెరగవచ్చనే ఆలోచన లబ్ధిదారుల్లో ఉంది.



జమ్మలమడుగులో పునాదుల స్థాయిలోనే పక్కాగృహాలు

బ్రహ్మంగారిమఠంలో పోటెత్తిన భక్తులు

- వైభవంగా రథోత్సవం
- దర్శనమిచ్చిన బ్రహ్మంగారు
- క్యూలైన్లలో వేచి వున్న భక్తులు



మాఢవీధుల్లో ఊరేగుతున్న బ్రహ్మరథం

బ్రహ్మంగారిమఠం, మే 18: కాలజ్ఞాన కర్త శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాలు ఈనెల 14తేది నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదో రోజు శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ గుడి ఉత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు శనివారం తెల్లవారుజామున బ్రహ్మంగారి నివాసగృహం వీధుల్లో వేకువజామునే వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ, స్వామి మనవరాలు జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారు గ్రామోత్సవంలో ఊరేగారు. భక్తులు దర్శించుకుని కాయకర్పూరం సమర్పించారు. రథోత్సవం ముఖ్యమైన దినం కావడంతో భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. దూర ప్రాంతాల నుంచి దర్శనం కోసం వచ్చిన భక్తులకు దేవదాయశాఖ అసిస్టెంటు కమిషనర్, ప్రస్తుత ఆలయ ఫిట్ పర్సన్ శంకరబాలాజీ పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేశారు. తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, భోజన వసతి, విశ్రాంతి గదులు, క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించారు.

కన్నుల పండువగా బ్రహ్మంగారి బ్రహ్మరథోత్సవం

ఆరాధన గురుపూజా మహోత్సవాల్లో భాగంగా శనివారం కాలజ్ఞాని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మరథోత్సవంపై ఆలయ మాఢవీధుల గుండా రథాన్ని అశేష జనవాహిని మధ్య, భక్తుల కేరింతల మధ్య జై వీరబ్రహ్మ.. జై గోవిందమాంబ.. నామస్మరణలతో రథోత్సవం మారుమోగింది. ముందుగా బ్రహ్మరథోత్సవాన్ని ప్రారంభించే ముందు పూర్వపు మఠాధిపతి వీరభోగ వసంతవేంకటేశ్వరస్వామి కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. అనంతరం జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారు, మఠాధిపతి వీరకుమారస్వామి రథానికి పూజలు చేసి రథాన్ని ముందుకు కదిలించారు. దాదాపు రెండుగంటల పాటు రథోత్సవాన్ని ఆలయ మాఢవీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. జిల్లా నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి కూడా భక్తులు పాల్గొని రథోత్సవాన్ని తిలకించారు. గత కొన్నిరోజుల నుంచి ఎండవేడిమి ఎక్కువగా ఉంది. రథోత్సవం రోజు ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో విశేషంగా భక్తులు పాల్గొని బ్రహ్మరథోత్సవాన్ని కనులారా తిలకించారు. ఆరాధన మహోత్సవాలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ విద్యాసాగర్ పర్యవేక్షణలో బందోబస్తు చేపట్టారు. కాగా ఆరాధన మహోత్సవాలకు విచ్చేసిన భక్తులకు స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు సౌజన్యంతో ఛైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్, రాజంపేట డివిజనల్ మేనేజరు సుశాంత్‌కుమార్ భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు మేనేజరు బాలాదిత్య తెలిపారు.

దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



రేపటి నుంచి నారాపురం వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



నారాపుర వెంకటేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం

జమ్మలమడుగు, మే 18: జమ్మలమడుగు డివిజన్ కేంద్రమైన జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో ప్రసిద్ధిగాంచిన నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలు రేపటి నుంచి జరుగనున్నాయి. ఇందుకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు ప్రారంభించారు. ఆలయం లోపలి భాగంలో చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. ఈనెల 20వ తేదీ సోమవారం వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం 6 గంటల నుంచి అంకురార్పణంతో ప్రారంభమవుతాయి. అలాగే అన్నమాచార్య కీర్తనలు, సేనాధిపతి ఉత్సవం, హరికథ జరుగుతాయి. 21న ధ్వజారోహణం, చతుష్టార్చన, ఊంజల్ సేవ, పెద్దశేషవాహనం, కార్యక్రమాలు జరుగుతాయి. 22న చిన్నశేషవాహనం, స్నపన తిరుమంజనం, ఊంజల్‌సేవ, అన్నమాచార్య కీర్తనలు, హంసవాహనం, 23న ముత్యపు పందిరి వాహనం, స్నపన తిరుమంజనం, ఊంజల్‌సేవ, సింహవాహనం, హరికథ కార్యక్రమాలు జరుగుతాయి. 24న కల్పవృక్షవాహనం, హనుమంతవాహనం, 25న మోహిని ఉత్సవం, స్నపన తిరుమంజనం, గరుడవాహనం, 26న సర్వభూపాల వాహనం, స్నపన తిరుమంజనం, కల్యాణోత్సవం, గజవాహనం, 27న సోమవారం రథోత్సవం, ఉదయం 9.30 గంటలకు అనంతరం స్నపన తిరుమంజనం, అశ్వవాహనం జరుగుతాయి. 28న సూర్యప్రభవాహనం, ఊంజల్‌సేవ, చంద్రప్రభ వాహనం, 29న తిరుచ్చి వసంతోత్సవం, చక్రస్నానం, ధ్వజారోహణం జరుగుతాయి. 30న హోమం, సాయంత్రం పుష్పయాగం జరుగుతుంది. భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ అధికారులు కోరారు.

ప్రమాదవశాత్తు ఉపాధి కూలి మృతి



మృతి చెందిన సుబ్బరాయుడు

రాజుపాలెం, మే 18: మండల పరిధిలోని టంగుటూరు గ్రామానికి చెందిన ఉపాధి కూలీ వేంపల్లె చిన్నసుబ్బరాయుడు (65) శనివారం ప్రమాదవశాత్తు ట్రాక్టరుపై నుంచి పడి మృతి చెందాడు. గ్రామ సమీపంలోని అయ్యవారు పల్లెకు వెళ్లే దారిలో చాపాడు పంట కాల్వలో పూడికతీత పనులకు ఉదయం ట్రాక్టరులో బయల్దేరాడు. ట్రాక్టరు డోరుకు ఉన్న కడ్డీ విరగడంతో రోడ్డుపై పడ్డ సుబ్బరాయుడు తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టరులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. మృతునికి భార్య మౌలాలమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ఉపాధి హామీ పథకం జమ్మలమడుగు క్లస్టరు ఏపీడీ గడ్డం ఆనందం, రాజుపాలెం ఏపీవో కె.లక్ష్మీనారాయణ పరామర్శించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చేస్తామని తెలిపారు.

విద్యుత్ కార్యాలయ ఫీల్డ్ అసిస్టెంట్ హఠాన్మరణం



మృతిచెందిన ప్రసాద్

ఎర్రగుంట్ల, మే 18: ఎర్రగుంట్ల నగర పంచాయతీలోని డిస్కం కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్‌లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రసాద్(53) శనివారం హఠాన్మరణం చెందాడు. మధ్యాహ్నం కార్యాలయ ఆవరణలో ఉన్నఫళంగా కుప్పకూలి పోయాడు. చుట్టూ ఉన్నవారు వెంటనే అతన్ని పలకరించి చూడగా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అయితే తెలిసిన వెంటనే సీపీఆర్ చేయడంతో ఒక్కసారి మేల్కొని మళ్లీ కదలకపోవడంతో డాక్టర్ వద్దకు తీసుకెళ్లగా మృతి చెందినట్లు తెలిపారు. ప్రసాద్ మృతి పట్ల అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారన్నారు.

ఎలక్ట్రిక్ షాపుల్లో విజిలెన్స్ దాడులు



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కడప(క్రైం), మే 18: నగరంలోని ఎలక్ట్రికల్స్ షాపులో శనివారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి షేక్ మాసుం బాషా ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు అధికారులు దాడులు చేశారు. నగరంలోని వీరాస్వామి మండీ వీధిలో రాంసా ఎలక్ట్రికల్‌షాపు, గోడౌన్లలో తనిఖీ నిర్వహించారు. అక్కడి స్టాకు రిజిస్టర్లు, సేల్స్ రిజిస్టరు, పర్చేజ్ రిజిస్టరు తదితర రికార్డులను, గోడౌన్లను తనిఖీ చేశారు. కొన్ని వస్తువులకు ఎమ్మార్పీ లేకుండా తయారీ తేదీ లే కుండా ఉండడంతో కడప లీగల్ మెట్రాలజీ అధికారులు రెండు కేసులు నమోదు చేసి రూ.50 వేలు జరిమానా విధించారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ఈదురుబాషా, రెడ్డప్ప, బాల గంగాధర్‌రెడ్డి, గీతావాణి, బాబు మోజెస్, ఖాజాహుసేన్, మురళీక్రిష్ణ, అశోక్‌కుమార్, రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

- మామిడి చెట్లు నాటిన వైనం



భూమి కబ్జా చేసి నాటిన మామిడి చెట్లు

సిద్దవటం, మే 18: మండలం టక్కోలి గ్రామ సచివాలయం వెనుక భాగంలో సర్వే నెంబరు 522 టక్కోలి రెవెన్యూ పొలంలో 1.80 సెంట్లు ప్రభుత్వ భూమిని కొంత మంది కబ్జాదారులు దర్జాగా భూమి కబ్జా చేసి ఆ ప్రాంతంలో ఏకంగా మామిడి మొక్కలు నాటివేశారు. గ్రామంలో ఉన్న రెవెన్యూ అధికారి కబ్జాదారులపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో భూ కబ్జాదారులు మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతున్నారని పేదవానికి ఇల్లు కట్టుకోవడానికి 2సెంట్లు స్థలం మంజూరు చేయమని అడిగితే ఏ మాత్రం పట్టించుకోరని పట్టా కోసం కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేయాలని పేర్కొన్నారు. ఏకంగా ప్రభుత్వ భూములను కబ్జా చేస్తుంటే కబ్జాదారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్థానిక వీఆర్వో అండదండలు ఉన్నందునే కబ్జాదారులు పెట్రేగిపోతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయంపై స్థానిక వీఆర్వో చంద్రను వివరణ కోరగా భూకబ్జా జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్నామని అక్కడ సర్వేయర్‌ను పిలిపించి భూమిని సర్వే చేస్తున్నామని పూర్తి నివేదికను మండల తహశీల్దారుకు అందించడం జరుగుతుందని భూమి కబ్జా జరిగి ఉంటే తహశీల్దారు ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఇంకా అద్దె భవనాల్లోనే...

- జిల్లాలో సొంత భవనాలు లేని జిల్లా కార్యాలయాలు
- నెలల తరబడి అద్దె బిల్లులు పెండింగ్
- సర్దుకుపోతున్న జిల్లా అధికారులు



రాజంపేట రోడ్డు ఓదివీడు దగ్గర ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు

రాయచోటి(కలెక్టరేట్), మే 18: జిల్లా కేంద్రం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయినా ఇప్పటి వరకు జిల్లా కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సొంత గూటికై పోరాటం, అద్దె కట్టలేక ఆరాటపడుతున్న కార్యాలయాలు జిల్లా కేంద్రంలో చాలా ఉన్నాయి. ఐసీడీఎస్ పీడీ కార్యాలయ, భూగర్భ గనులశాఖ కార్యాలయం, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా దేవదాయశాఖ కార్యాలయం, లేబర్ ఆఫీసు, తూనికలు, కొలతలు ఆఫీస్, జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ కార్యాలయాలకు వేల రూపాయల అద్దె కట్టలేక అధికారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగైదు నెలలకు ఒకసారి ఇంటి బాడుగలు కట్టడానికి తలప్రాణం తోకకు వచ్చినంత పని అవుతోందని అధికారులు చెప్పకనే చెప్పేస్తున్నారు. 1వ తేదీ వచ్చేసరికి ఇంటి ఓనరు బాడుగ అడిగితే బడ్జెట్ వచ్చాక ఇస్తాము అని చెప్పుకుంటూ నెలల తరబడి కాలం నెట్టుకొస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేసింది కానీ కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్న ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. ఇలా ఒక్కొక్క కార్యాలయానికి 20 వేల వరకు నెలకు అద్దె ఇస్తున్న ఇరుకైన గదుల్లో సర్దుకుపోతున్నామంటూ సిబ్బంది బహిరంగంగానే చెప్పేస్తున్నారు.

అందుబాటులో లేని ప్రభుత్వ కార్యాలయాలు

జిల్లా కార్యాలయాలు ఏర్పాటు చేసే క్రమంలో కొన్ని కార్యాలయాలు రాజంపేట రోడ్డు ఓదివీడు మైనార్టీ హాస్టల్‌లో ఏర్పాటు చేశారు. ఇక్కడ సోషల్ వెల్ఫేర్ కార్యాలయం, బీసీ వెల్ఫేర్ కార్యాలయం, జిల్లా పంచాయతీ ఆఫీస్, ఏపీఎంఐపీ వారి కార్యాలయం, డ్వామా పీడీ కార్యాలయం, పంచాయతీరాజ్ కార్యాలయం, మత్స్యశాఖ, భూగర్భజల వనరులశాఖ వంటి కార్యాలయాలు అప్పట్లో ఇక్కడ ఏర్పాటు చేశారు. ఇక్కడ దాదాపు 150 మందికిపైగా సిబ్బంది పనిచేస్తున్నారు. వీరందరూ కూడా కడప, తిరుపతి, పీలేరు, మదనపల్లె, రాజంపేట ప్రాంతాల నుంచి ప్రతిరోజూ వచ్చి ఉద్యోగం చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఇక్కడ దాదాపు 20 మందికి పైగా మహిళలు ఉద్యోగం చేస్తున్నారు. వీరికి తాగడానికి నీళ్లు, మరుగుదొడ్లు కూడా సరిగా లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్టాండు నుంచి దాదాపు నాలుగు కిలోమీటర్లు రావాలంటే కొన్ని సందర్భాల్లో ఎటువంటి రవాణా సౌకర్యాలు లేవని వారు చెబుతున్నారు. కడప నుంచి ఒక బస్సు తీసుకుని అందులో దాదాపు 50 మంది ప్రతి రోజూ ప్రయాణం చేసి ఇంత దూరం వస్తున్నామని చెబుతున్నారు. వేళ కాని వేళలో తాగడానికి నీళ్లు, తినడానికి తిండి కూడా దొరకని ప్రాంతాల్లో మహిళలు అని కూడా చూడకుండా ఉద్యోగాలు వేయడం చాలా దారుణమని కొంతమంది మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు ఒక ప్రత్యేకమైన ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులను వివరణ కోరగా... వారు అద్దె విషయమై మేము మీకు చెబితే మాకు ఇబ్బంది అవుతుంది. మేమే ఏదో ఒకటి సర్ది చెప్పుకునే ప్రయత్నిస్తున్నాం. వదిలేయండి అని మొహం చాటేస్తున్నారు.



ప్రైవేటు బిల్డింగ్‌లో నడుస్తున్న గనుల శాఖ కార్యాలయం

భక్తులతో కిటకిటలాడిన గండి క్షేత్రం



గండి ఆలయం ప్రాంగణంలో భక్తులు, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద టెంకాయలు కొడుతున్న దృశ్యం

చక్రాయపేట, మే 18: గండి వీరాంజనేయస్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఆగస్టులో జరిగే శ్రావణ మాసోత్సవాల్లో మొదటివారాన్ని తలపించింది. ఉదయం 10 గంటల నుంచి క్యూలైన్లు కిక్కిరిశాయి. సెలవులు కావడంతో విద్యార్థులు, భక్తులు, మొక్కుబడులు ఉన్నవారు 101 టెంకాయలు కొట్టారు. దీనికి తోడు వేసవి కావడంతో ఎండలు అధికంగా లేకపోవడం, వాతావరణం చల్లబడడంతో భక్తులు గండికి చేరుకున్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు సహాయ కమిషనర్ ముకుందరెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు. ఆకుపూజకు 138, వీఐపీ 200, స్పెషల్ దర్శనం 485, వాహన పూజ 76, లడ్డుప్రసాదాలు 2611 టికెట్లు అమ్ముడైనట్లు తెలిపారు. వీటి ద్వారా రూ.2,89,785 ఆదాయం వచ్చినట్లు ఏసీ ముకుందరెడ్డి తెలిపారు. భక్తులు దాదాపు గంటకు పైగా దర్శనం కోసం వేచి ఉన్నారు. హరికథ కాలక్షేపాన్ని ఏర్పాటు చేశారు. ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్ తీర్థప్రసాదాలు అందించారు. మూల విరాట్‌ను ప్రత్యేక పూలతో అలంకరించారు. అలాగే 1300 మంది దాకా భక్తులు అన్నప్రసాదం తిన్నారు. బాలాలయం అయినప్పటికి భక్తులు పెద్దఎత్తున రావడం విశేషం. ఆలయ నిర్మాణం పూర్తయితే మరింత మంది భక్తులు తండోపతండోలుగా వస్తారని చెబుతున్నారు.

నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం

ప్రసిద్ధ గండి క్షేత్రంలో నిర్వహించే నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం అందించినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో దువ్వూరు మండలం పెద్ద భాకరాపురం వాసి ఉమ్మడి ఆంజనేయులు, ధర్మపత్ని వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులు ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. వీరికి ఉప ప్రధాన అర్చ కులు రాజాస్వామి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందించినట్లు తెలిపారు.

రేపు ఆర్టీసీ సమస్యలపై డయల్ యువర్ ఆర్ఎం

కడప(మారుతీనగర్), మే 18: ఆర్టీసీ బస్సుల విషయం, సమస్యలపై 20వ తేదీ సోమవారం డయల్ యువర్ ఆర్ఎం నిర్వహించనున్నట్లు ఆర్ఎం గోపాల్‌రెడ్డి తెలిపారు. సమస్యలను నేరుగా ఆర్టీసీ అధికారికి తెలియపరచి నివృత్తి చేసుకునేందుకు వీలుగా 20వ తేది సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం జరగనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలను, సూచనలను, సలహాలను 9959225848 అనే నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. ఈ సదవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేడుకగా పెద్దమ్మ తల్లి జాతర




విశేష అలంకరణలో పెద్దమ్మతల్లి, అమ్మవారి దర్శనానికి భారీగా తరలివచ్చిన మహిళలు

- **80 సంవత్సరాల తర్వాత దేవరకు భారీ స్పందన**

ఎర్రగుంట్ల, మే 18: దాదాపు 80 సంవత్సరాల తర్వాత జరుగుతున్న దేవరకు గ్రామస్తులు, భక్తులు పోటెత్తారు. మండలంలోని పొట్లదుర్తిలో పెద్దమ్మ, చిన్నమ్మ దేవర వైభవంగా జరుగుతోంది. శనివారం ఉదయం గ్రామం నాలుగు దిక్కుల్లో మామిడి తోరణాలు కట్టి గ్రామానికి శుభం జరగాలని ప్రార్థించారు. పెద్దమ్మ తల్లికి తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించి విశేష అలంకరణ నిర్వహించారు. వేలాదిగా వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయానికి ఎదురుగా అశ్వత్థనారాయణ వృక్షం వద్ద పూజలు నిర్వహించి అమ్మవారి త్రిశూలాన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం సుమారు 6 వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.

చిన్నమ్మ-పెద్దమ్మ ప్రతిమలతో ఊరేగింపు

దేవరలో భాగంగా శనివారం సాయంత్రం కుమ్మరివీధిలో పెద్దమ్మతల్లి-చిన్నమ్మతల్లి ప్రతిమలను చేసి పూజలు చేశారు. అనంతరం ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీ సీఎం.రమేశ్, మాజీ సర్పంచ్ సురేశ్‌నాయుడు, ఇతర నాయకులు, పూజలు నిర్వహించారు. కాగా 100 మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు.



భక్తుడిపై దూసుకెళ్లిన కారు- వ్యక్తి మృతి



ప్రమాదవశాత్తు మరణించిన ఇంద్రబాబు

బ్రహ్మంగారిమఠం, మే 18: బ్రహ్మంగారి మఠంలో కారు దూసుకెళ్లడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గుంటూరు పట్టణానికి చెందిన నల్లపాడు గ్రామం నుంచి బ్రహ్మంగారి ఆరాధన గురుపూజా మహోత్సవాలకు పార్లపల్లి ఇంద్రబాబు (56), అతని భార్య జయలక్ష్మి మఠానికి చేరుకున్నారు. శనివారం స్థానిక డిగ్రీకళాశాల ఆవరణలో చెట్టు కింద దంపతులు కూర్చుని ఉండగా ఒక్కసారిగా కారు వారిపైకి దూసుకువచ్చి ఇంద్రబాబుపై వెళ్లడంతో అతనికి తీవ్ర గాయాలై ప్రథమ చికిత్సకు తీసుకెళ తుండగా మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అలాగే అతనితో పాటు ఉన్న జయలక్ష్మికి కూడా కాళ్లు వాపులు ఎక్కువగా రావడంతో బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. దూసుకు వచ్చిన కారు హైదరాబాదు బాలానగర్‌కు చెందిన వారిదిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో మృతదేహాన్ని బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు బి.మఠం పోలీసులు తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం



మృతిచెందిన ఈశ్వర్ ప్రసాద్

కడప క్రైం, మే 18: కడప నగరం పీఎఫ్ ఆఫీస్ సమీపంలో ఈనెల 17వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంలో శేషం ఈశ్వర్ ప్రసాద్ (12) దుర్మరణం చెందగా బాలుడి తండ్రికి గాయాలైనట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు ఆర్‌పీఎస్ నగర్ వాసి శేషం వెంకటేశ్వర్లు తన కుమారుడితో కలిసి ఎర్రముక్కపల్లికి ద్విచక్రవాహనంలో వచ్చి తిరిగి వెళ్తుండగా పీఎఫ్ ఆఫీస్ ఎదురుగా వస్తున్న మరో బైకును తప్పించబోయారు. ఈ క్రమంలో వీరి బైకు అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. బాలుడి తలకు బలమైన గాయం తగలడంతో మృతిచెందాడు. గాయపడిన బాలుడి తండ్రిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌పై ప్రత్యేక నిఘా

కౌంటింగ్ పూర్తయ్యే వరకూ ఎలాంటి అనుమతులు ఉండవు

పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్

పులివెందుల రూరల్, మే 18: రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పులివెందుల డివిజన్ పరిధిలో అల్లర్లు సృష్టించే వారిని జిల్లా బహిష్కరిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల పోలింగ్‌కు ముందు, తర్వాత జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో రౌడీషీటర్లకు, గొడవలు, అల్లర్లు సృష్టించే వారికి, వాటిలో పాల్గొనే వారికి, సోషల్ మీడియాలో పార్టీలు, వర్గాలకు మధ్య రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసే వారికి, పోస్టులు పెట్టేవారికి హెచ్చరికలు జారీ చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తామన్నారు. ఇప్పటికే డివిజన్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసుల్లో ఉన్న వారికి కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. సూచనలు పెడచెవిన పెట్టి ఘర్షణ వాతావరణం సృష్టిస్తే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయడం, జిల్లా బహిష్కరణ, పీడీ యాక్టు నమోదుకు వెనుకాడమన్నారు. జూన్ 4వ తేదీన కౌంటింగ్ ఉన్న నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో అదనపు బలగాలు మోహరిస్తాయన్నారు. ఇప్పటికే సమస్యలున్న చోట పికెటింగ్, రాత్రి, పగలు పెట్రోలింగ్ ఏర్పాటు చేశామన్నారు. శాంతిభద్రతలు కాపాడే విషయంలో పోలీసు వారికి సహకరించాలన్నారు. పార్టీల కార్యకర్తలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వారిని మందలించినట్లు తెలిసింది. మీడియా సమావేశంలో డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

144 సెక్షన్, పోలీసు యాక్టు అమలు : కడప డీఎస్పీ షరీఫ్

కడప (క్రైం), మే 18: జూన్ 6 వతేదీ వరకు కడప అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతిలేదని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కడప డీఎస్పీ ఎస్‌ఎండీ షరీఫ్ హెచ్చరించారు. శనివారం డీఎస్పీ కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదల చేశారు. జూన్ 6 అనంతరం మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ముగిసిన తరువాత పరిశీలించి ర్యాలీలకు, ఊరేగింపులకు అనుమతిస్తామన్నారు. అంతవరకూ 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు కూడా అమలులో ఉంటుందన్నారు. నగరంలో అన్ని రకాల దుకాణాలు రాత్రి 9గంటలకల్లా మూసివేయాలన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

● నోడల్ డీఎస్పీ సుధాకర్

కమలాపురం రూరల్, మే 18: నియోజకవర్గం పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నోడల్ డీఎస్పీ సుధాకర్ హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జూన్ 6 వతేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీల వ్యక్తులు, అనుచరులు కానీ, ఘర్షణలు పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కమలాపురంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, కౌంటింగ్ పూర్తయ్యే వరకు శాంతి భద్రతల నిమిత్తం ఈ ముందస్తు చర్యలు కొనసాగుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రజలు ఎలాంటి ఘర్షణలు పడవద్దని పోలీసులు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కమలాపురం నోడల్ సీఐ శంకర్‌నాయక్, కమలాపురం సీఐ రామక్రిష్ణారెడ్డి ఎస్‌ఐలు రుషికేశవరెడ్డి సిబ్బంది ఉన్నారు.

నైతిక విలువలతోనే జీవనవికాసం



విద్యార్థినికి బహుమతిని అందిస్తున్న బ్రహ్మకుమారి అక్కయ్య

కడప (కల్చరల్) మే 18: భూమిపై జన్మించిన ప్రతి మనిషీ నైతికవిలువలతో మెలిగితే వారి దైనందిన జీవితం వికాసవంతంగా వుండగలదని బ్రహ్మకుమారీలు ఈశ్వరి, ప్రదీప అక్కయ్య సూచించారు. విద్యార్థులకు వేసవి సెలవులను పురస్కరించుకుని ఈనెల 14 నుంచి ఓం శాంతినగర్‌లో నిర్వహిస్తున్న పిల్లల వేసవి శిక్షణ శిబిరంలో పిల్లలకు నైతిక విలువలు, సాంస్కృతిక క్రియాశీలత, రాజయోగ మెడిటేషన్ గురించి నేర్పించారు. నృత్యాలు, పాటలు, డ్రాయింగ్, ఏకాగ్రతకు సంబంధించిన పోటీలను నిర్వహించారు. ఆయా అంశాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు శనివారం ప్రత్యేక సమావేశంలో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కంటి క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం

కడప (సెవెన్‌రోడ్స్), మే 18: రెటినోబ్లాస్టోమా అనే కంటి క్యాన్సర్ పట్ల పిల్లల తల్లిదండ్రులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కడప ఎల్వీపీఈఐ రాజశేఖర్ రెడ్డి ప్రాంగణలో కంటి క్యాన్సర్ నిపుణులు, ప్రాంగణ అధిపతి డాక్టర్ కావ్య ఎంబెజ్జంకి సూచించారు. ప్రపంచ రెటినోబ్లాస్టోమా కంటి క్యాన్సర్ అవగాహన వారోత్సవంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఏటా పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రెటినోబ్లాస్టోమా అనే కంటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు రెండేళ్లగా ఏటా వైట్‌థాన్ పేరిట పరుగు/నడక/రన్నింగ్, వాక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాధారణంగా కంటి క్యాన్సర్ మూడేళ్లలోపు ఉన్న పిల్లలను ఎక్కువగా ప్రభావితం చేస్తుందన్నారు. సకాలంలో ఈ వ్యాధిని గుర్తించకపోవడం, చికిత్స తీసుకోకపోవడంతో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. బిడ్డకంట్లో తెల్లని ప్రతిబింబం కంటి క్యాన్సరుకు ఒక సూచన కావచ్చన్నారు. అలా కనిపిస్తే కంటి వైద్యుడిని సంప్రదించాలన్నారు.

జోరుగా పందేలు...!

టీడీపీ, వైసీపీ గెలుపోటములపై మండల వ్యాప్తంగా రోజూ ఇదే చర్చ ● సీట్లు, మెజార్టీపై విడివిడిగా పందేలు



చెన్నూరు, మే 18: ఎన్నికల ఫలితాలపై మండలంలో జోరుగా బెట్టింగులు జరుగుతున్నాయి. ఈ బెట్టింగులు ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపిక నుంచే ఆరంభమయ్యాయి. నియోజక వర్గానికి అభ్యర్థి ఎవరనేది మొదటిగా పందేలు కాయగా.. టిక్కెట్ వచ్చాక ఎవరి గెలుపు ఎలా ఉంటుందనేది రెండో దశగా చెప్పవచ్చు. ఎన్నికల పోలింగ్ ముగిశాక పార్టీల విజయాలపై బెట్టింగులు మరింత ఊపందుకున్నాయి. ప్రధాన పార్టీల అభిమానులు, ఇతర రంగాల వ్యాపారులు కూడా లాభాపేక్షతో బెట్టింగులు కాస్తున్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ వర్గీయులు.. వైసీపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ సానుభూతిపరులు బెట్టింగులు పెడుతున్నారు. అంతేకాకుండా టీడీపీకి ఎన్ని సీట్లు వస్తాయి, వైసీపీకి ఎన్ని వస్తాయి, టీడీపీకి మెజార్టీ ఎంత, వైసీపీకి ఎంత, 2019 ఎన్నికల కన్నా ఇప్పుడు మెజార్టీ పెరుగుతుందా, తగ్గుతుందా అన్న విషయాలపై మండల వ్యాప్తంగా చర్చలు మొదలయ్యాయి. అదే సమయంలో జిల్లాలో ఎన్నిస్థానాలు టీడీపీ ఎన్ని, వైసీపీ ఎన్ని గెలుచుకుంటుంది అన్న దానిపై పందాలు మొదలయ్యాయి. వివరాల్లోకెళితే...

ఉదయం లేచింది మొదలు తిరిగి పడుకునే వరకు చెన్నూరులో జరిగే పందాలపై, చర్చలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా పందేలు కాసే వారు రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ విస్తృతంగా ప్రచారం నిర్వహించి సంక్షేమ పథకాలు చెప్పడం, ముఖ్యంగా పెన్షన్, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ల్యాండ్ టైటలింగ్ యాక్టు, బీసీ, ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛను అని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో ప్రజలు ఎలా స్పందించి ఓట్లు వేసి ఉంటారు, దీంతో ఎంత మెజార్టీ వస్తుందన్న దానిపై వైసీపీలో టీడీపీ బీజేపీ కలయిక వల్ల మైనార్టీలు ఎవరి వైపు మొగ్గు చూపా రు. వారు ఎంత మేర వైసీపీకి ఓటు వేశారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో ప్రజలు లబ్ధి పొంది ఏ విధంగా ఓటు వేశారన్నదానిపై బేరీజు వేసుకుంటూ ఎన్ని సీట్లు వస్తాయని మాట్లాడుకుంటూ పందేలకు సై అంటున్నారు. ఓ వైపు కూటమికి ఇన్ని సీట్లు వస్తాయి, టీడీపీ వారు సవాల్ చేసి పందేలు వేస్తుండగా, వైసీపీ వారు రాబోయే అధికారం మాదే అంటూ మరో వైపు వారు సవాళ్లు విసురుతున్నారు. పైగా జిల్లాలో 2019లో వైసీపీ స్థానాలు బాగా వచ్చాయి కదా, ఈ మారు ఆ స్థానాల్లో టీడీపీ బలంగా దెబ్బకొడుతుందన్నదానిపై కూడా పందేలకు సై అంటున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే మండలంలో ఈ మారు టీడీపీకే మెజార్టీ వస్తుందని గతంలో ఎన్నడూ లేనివిధంగా మంచి ఓట్లు రాబోతున్నాయని ఓవైపు పందేలకు టీడీపీ వారు పిలుస్తున్నారు. గ్రామాల వారీ ఎవరెవరికి ఎన్ని ఓట్లు వస్తాయి, వాటిపై కూడా ఇరువర్గాలు పందేలకు సై అంటున్నారు. గ్రామాలు మొదలు కుని మండలం, జిల్లా, రాయలసీమ, కోస్తా రాష్ట్రం ఈ విధంగా వేటికవే వేర్వరుగా పందేలకు ఒకరిపై ఒకరు సై సై అనుకుం టున్నారు. అయితే ఈ పందేలకు పెద్దమ నుషులుగా కొందరిని నియమించుకుని వారినే మధ్యవర్తిగా పెట్టి పందేలకు రమ్మ ని ఒకరికొకరు చెబుతున్నారు. మొత్తమ్మీద 2024 ఎన్నికలు ఇరుపార్టీలకు ప్రతిష్ఠాత్మకం కావడంతో పందాలు కూడా అంతే స్థాయిలో జోరుగా ఊపందుకున్నాయి.

మంచాలమ్మ పాలేటి గంగమ్మ తిరుణాళ్ల మహోత్సవం రేపు



కమలాపురం రూరల్, మే 18: చదిపిరాళ్ల, గొల్లపల్లె గ్రామాల మధ్య వెలసిన మంచాలమ్మ పాలేటి గంగమ్మ తల్లి తిరుణాళ్ల మహోత్సవం 20తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం గణపతి పూజ అభిషేకాలు ప్రధాన కలశస్థాపన మంగళ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 7గంటల నుంచి రాత్రి 10 వరకు అన్నదానం ఉంటుందన్నారు. సాయంత్రం చదిపిరాళ్ల, గొల్లపల్లెల్లో అమ్మవారి ఊరేగింపు ఉంటుందన్నారు.

బండలాగుడు పోటీలు

తిరుణాళ్ల సందర్భంగా ఆలయం ఎదుట పాలపళ్ల ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు అందిస్తామని ఆసక్తిగల ఎడ్ల యజమానులు ఈ పోర్టల్‌లో పాల్గొనాలని తెలిపారు.

నేడు నృత్య ప్రదర్శనలు

పులివెందుల టౌన్, మే 18: స్థానిక శిల్పారామం, ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి 8గంటల వరకు నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తారని పరిపాలన అధికారి సుధాకర్ తెలిపారు. శిల్పారామంలో విజయవాడ ఎక్సలెంట్ ఇన్‌స్టిట్యూట్ వారి నాగార్జున (ఈఎం) స్కూల్ చిన్నారులచే నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె కళాతరంగిణి బృందంచే నృత్య ప్రదర్శనలు ఉంటాయని, విజయవంతం చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

వేడుకగా వాసవీ మాత జయంతి

కడపలో 102 క్షీర కలశాలతో అమ్మవారి ఊరేగింపు ● కమలాపురంలో పులిహోరతో అమ్మవారి ప్రతిమ



కమలాపురంలో పులిహోరతో అమ్మవారి ప్రతి రూపం







కడపలో ప్రత్యేక అలంకారంలో వాసవీ అమ్మవారు - కలశాలతో అమ్మవారి ఊరేగింపు - వేంపల్లెలో అమ్మవారు

కడప (కల్చరల్) మే 18: వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి అమ్మవారి ఊరేగింపు వేడుకగా నిర్వహించారు. అమ్మవారి జయంత్యుత్సవాల్లో భాగంగా ఆర్యవైశ్య సంఘం (కడప) ఆధ్వర్యంలో శనివారం ఉదయం 6 గంటలకు పాండురంగ స్వామి దేవస్థానం నుంచి 102 క్షీర కలశాలతో వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయం వరకూ అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. పిదప ఆలయ ప్రాంగణంలో వాసవీ హోమం, పూర్ణాహుతి పూర్తిచేశారు. మధ్యాహ్నం 1 గంటకు భక్తాదులకు భోజన, ప్రసాదాలను వితరణ గావించారు. రాత్రి 7 గంటలకు అమ్మవారిని పూలపల్లకీలో మాడవీధుల్లో ఊరేగించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సతీష్ కుమార్, కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి సుమన్, సభ్యులు పరిటాల వెంకటరమణయ్య, పేటేటి శ్రీనివాసగుప్త, బెస్తవేముల రామ్‌మహేష్, సి.పుల్లయ్య, రమేష్‌బాబు, వెంకటేశ్వరరావు, మధు, ఎం. నరసింహ్మప్రసాద్, గోపాలకృష్ణ, రాజేష్‌కుమార్, ఎం. ప్రసాద్, కె. వెంకట సతీష్‌కుమార్, ఎం శ్రావణ్‌కుమార్, రవికుమార్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

పులిహోరతో అమ్మవారి ప్రతిరూపం

కమలాపురం రూరల్, మే 18: వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో వాసవీ మాత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు సహకారంతో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకీలో అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారిశాలలో పులిహోరతో అమ్మవారి ప్రతిరూపాన్ని ప్రదర్శించారు.

వేంపల్లెలో...

వేంపల్లె, మే 18: వేంపల్లెలోని అమ్మవారిశాలలో శనివారం వాసవీ కన్యకపరమేశ్వరి దేవి జయంతి మహోత్సవాలు వైభవంగా నిర్వహించామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర తెలిపారు. అర్చకులు ప్రసాద్‌శర్మ నేతృత్వంలో అభిషేకం, మహామంగళ హారతి నిర్వహించామన్నారు. ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, మహిళా మండలి, ఆవోపా కార్యవర్గసభ్యుల పాల్గొన్నారు.

వేపమాను సత్రంలో తాగునీటి కష్టాలు



మంచినీటికోసం ట్యాంకర్ల వద్ద మహిళలు

సికెదిన్నె, మే 18: చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లె పంచాయతీ వేపమాను సత్రం జె.నారాయణపురం, జీ.వి.ఎస్. తండాల్లో ఇప్పెంట పంచాయతీ వేపమాను సత్రంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. అయితే అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. తాగునీటి ఇబ్బందులు ఎదురైనా స్థానిక అధికారులు ట్యాంకర్ల ద్వారా అరకొర నీటి సరఫరా చేస్తున్నా అవి ప్రజల అవసరాలు తీర్చడంలేదని మరిన్ని ట్యాంకర్ల ద్వారా నీరు అందించి తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు. పనులు మానుకుని ట్యాంకర్ల కోసం ప్రజలు ఎదురుచూడాల్సి వస్తోందని మహిళలు ఎండను సైతం లెక్కచేయకుండా ట్యాంకర్ల వద్ద బిందెలతో క్యూలో నిల్చోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరిన్ని ట్యాంకర్ల ద్వారా నీరు అందించి ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

దాతల ద్వారా మంచినీటి సరఫరా


మంచినీటి కష్టాలు ఎదుర్కొంటున్న విషయాన్ని టీడీపీ డాక్టర్ల సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ క్రిష్ణకిశోర్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని అందిస్తున్నారు. కొంతవరకు ప్రజలకు ఉపశమనం కలిగినట్లు తెలిపారు. భూగర్భజలం అడుగంటిపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు.

ట్యాంకర్ ద్వారా అందిస్తున్నాం

ప్రజలు తాగునీటికోసం ఇబ్బందులు పడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. భూగర్భజలం అడుగంటడంతో మోటార్లు అదనపు పైపులు దించినా మోటార్లు ఫెయిల్ అయ్యాయి. దీంతో ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా చేసి ప్రజల ఇబ్బందులు తొలగిస్తున్నాం.

నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి

కొండపేట వంతెనపై డిజిటల్ లైట్లు లేవా?



కొండపేట వంతెనపై ఉన్న సోలార్ లైటు

చెన్నూరు, మే 18: చెన్నూరు - కొండపేట మధ్య డిజిటల్ లైట్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో వేసిన నాలుగు సోలార్ లైట్లు సరిగా వెలగడంలేదు. వీటి స్థానంలో డిజిటల్ లైట్లు వేసే ఆలోచన ఏమన్నా రెండు గ్రామ పంచాయతీలకు ఉందా లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పెన్నానదిపై నిర్మించిన ఈ వంతెనకు ఇరువైపులా చెన్నూరు కొండపేట గ్రామాలున్నాయి. ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు ఎక్కువే. రేయింబవళ్లు ప్రజలు, రైతులు ఈ దారిన తిరుగుతుంటారు. తెల్లవారు జామున అటు చీకటి పడిన తరువాత యువకులు ఈ వంతెనపై నిత్యం వాకింగ్ చేస్తుంటారు. ఇలాంటి వంతెనపై చీకటి పడితే సరైన విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని పలుమార్లు గ్రామ పంచాయతీలకు చెప్పారు. అయితే నిధుల కొరత, మరేదో సమస్యనో తెలియదు కానీ రెండు గ్రామ పంచాయతీల తరపున లైట్లు మాత్రం ఏర్పాటు చేయలేదు. ఎప్పుడో నాలుగు సోలార్ లైట్లు వేసి చేతులు దులిపేసుకున్నారే తప్ప ఆపై ఎలాంటి పనులు చేపట్టలేదు. దాదాపు 700 మీటర్ల మేర వంతెన పొడవు ఉండడంతో సుమారు 20 లైట్ల వరకు వేయాల్సి ఉంది. కనీసం అందులో సగమైనా వేసి పుణ్యం కట్టుకోండి బాబూ అని ప్రజలు మొత్తుకున్నా స్పందన లేదని ఇరు పంచాయతీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా సోలార్ లైట్లు ఇబ్బందులు వస్తే వాటిని మరమ్మత్తులు చేసేదెవరు, అదే డిజిటల్ లైట్లు వేస్తే చిన్నపాటి ఇబ్బందులు వచ్చినా మార్చుకోవచ్చని అంటున్నారు. ఇప్పటికైనా రెండు గ్రామ పంచాయతీల సర్పంచులు స్పందించి లైట్లు వేసి పుణ్యం కట్టుకోవాలని కోరుతున్నారు.

కలసపాడులో బ్రహ్మంగారి గ్రామోత్సవం

కలసపాడు, మే 18: బ్రహ్మంగారి ఆరాధన సందర్భంగా శనివారం సాయంత్రం బ్రహ్మంగారి గ్రామోత్సవం కలసపాడు పురవీధుల్లో విగ్రహాలను ఊరేగించారు. ఊరేగింపు వెంట తంబళ్లపల్లికి చెందిన కోలాట బృందం అలరించింది. ముందుగా బ్రహ్మంగారి గుడి వద్ద తెల్లపాడు గ్రామస్తులచే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు సాదు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు.



రేపటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

కడప (నాగరాజుపేట), మే 18: కడప నగరం రామక్రిష్ణ నగర్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించేందుకు సన్నద్ధ సమావేశాన్ని ఉర్దూ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. రాష్ట్ర కమిటీ మెంబరు ఏడీ దేవదత్తం మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక విద్యార్థుల కోసం చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. జనవిజ్ఞానవేదిక సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తోందని, ఈ క్యాంపుల్లో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా కృత్యాలు ఉంటాయని తెలిపారు. వేసవిలో విద్యార్థులు తమ సమయాన్ని వృధా చేసుకోకుండా విజ్ఞానం వినోదంతో కూడిన అంశాలు నేర్చుకునేందుకు ఇదొక వేదికన్నారు. నగర కమిటీ ప్రధాన కార్యదర్శి పైడికాల్వ కిరణ్‌కుమార్ మాట్లాడారు. సమ్మర్ క్యాంపు 20 నుంచి ఉర్దూప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉదయం 8 నుంచి 11 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేదిక సీనియర్ నేత వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ ట్రెజరర్ సమీర్‌బాషా, పాఠశాల హెచ్‌ఎం అంజాద్ అలీ, విద్యా కమిటీ మెంబరు అబ్దుల్, ఐద్వా నాయకురాలు ఐఎస్ సుబ్బమ్మ, జనవిజ్ఞాన వేదిక సమతా కమిటీ మెంబరు కామేశ్వరమ్మ, డ్రాయింగ్ మాస్టర్ శ్రీనివాసులు, వేదిక జిల్లా కల్చరల్ కమిటీ కన్వీనరు, క్రాఫ్ట్ మాస్టర్ రంగనాయకులు పాల్గొన్నారు.

హైస్కూలుప్లస్‌లో నియామకాలు చేపట్టాలి

కడప (నాగరాజుపేట), మే 18: రాష్ట్రంలో ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభం కానున్న హైస్కూలు ప్లస్‌లో నియామకాలు వెంటనే చేపట్టాలని ఏపీసీపీఎస్ ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ వెంకట జనార్ధన్‌రెడ్డి తెలిపారు. జూన్‌లో కళాశాలలు మొదలు కాబోతున్నా ఇప్పటి వరకు ఉపాధ్యాయుల నియామకాలు ప్రక్రియ మొదలుపెట్టకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆయా కళాశాలల్లో విద్యార్థుల నమోదు కూడా చురుగ్గా సాగుతోంది. కాబట్టి అధికారులు వెంటనే నియామకాలు చేపట్టాలని, ఈ నియామకాల్లో ముందు నుంచీ పీజీటీలుగా పనిచేస్తున్న సిబ్బందికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

కురిసింది వాన..

కరుణించిన వరుణుడు ● కడపలో మోస్తరు వర్షం

కడప (ఎర్రముక్కపల్లె), మే 18: కడప నగరంలో శనివారం వర్షం కురిసింది. నెల రోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపించడంతో జనాలు ఎండ వేడిమికి తాళలేక ఉక్కిరిబిక్కిరయ్యారు. ఇంకొందరికి వడదెబ్బ కొట్టి ప్రాణాలు వదిలారు. రాత్రుళ్లు ఉక్కబోతతో ప్రజలు అల్లాడిపోయారు. గతేడాది కూడా వర్షాలు కురవకపోవడంతో ఈ సారి ఎండ వేడి ఎక్కువవడంతో చెరువులు, నదులు, కుంటలన్నీ చుక్క నీరు లేక ఎండిపోయాయి. దీంతో పశు పక్షాదులు తాగేందుకు నీరు లేక అలమటించాయి. ఈ క్రమంలో శనివారం కడప నగరంలో కురిసిన వర్షం ప్రజలకు ఎంతో హాయినిచ్చినట్లైంది. ఒక్కసారిగా ఉరుము లు మెరుపులతో వర్షం చాలా సేపు కురవడంతో నగరం మొత్తం వర్షంలో తడిసి ముద్ద యింది. కొన్ని వీధుల్లో నీరు పారేందుకు సరైన కాల్వలు లేక అలాగే రోడ్లపై నిలిచిపోయి బురదమయంగా మారాయి. ఆర్టీసీ బస్టాండు, అప్సర సర్కిల్, సెవెన్‌రోడ్స్, ఎన్‌జీఓ కాలనీ, వన్‌టౌన్ తదితర చోట్ల వర్షం నీరు రోడ్లపై పారింది. ఏది ఏమైనా వరుణుడు కరుణించ డంతో కడప నగర ప్రజలకు కొంతైనా వేసవి నుంచిఉపశమనం కలిగించినట్లయింది.

వీఎన్‌పల్లెలో భారీ వర్షం

వీరపునాయునిపల్లె, మే 18: వీరపునాయునిపల్లెలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఒక్కసారిగా వరుణదేవుడు ప్రజలకు ఊపిరిపోశాడు. పదును వర్షం కురవడంతో వేసవి దుక్కులు వస్తాయని రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఉద్యాన పంటలకు ఈ వర్షం ప్రాణం పోసిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి



ప్రొద్దుటూరు.. వజ్రపుచీర, కిరీటం అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారు

ప్రొద్దుటూరు టౌన్, మే 18: వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించి పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన గజమాలలతో శోభాయమానంగా అలంకరించారు. అమ్మవారి ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు. లోక కల్యాణార్థం వేద పండితులు గణపతి, నవగ్రహ, రుద్రహోమం, చండీ హోమాలను నిర్వహించి పట్టువస్త్రాలు, పూజ, హోమద్రవ్యాలను పూర్ణాహుతిగా సమర్పించారు. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని అమ్మవారి మూలవిరాట్‌ను వజ్రపు చీర, వజ్రపు కిరీటంతో అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం 102 మంది ఆర్యవైశ్య సుహాసినులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

మైదుకూరు..: వాసవీకన్యకాపరమేశ్వరీదేవి జయంతి సందర్భంగా శనివారం మైదుకూరులోని అమ్మవారు శాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్యసభ అధ్యక్షులు నూరిశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు బోయలకుంట్ల సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో వాసవీమాత మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి, భక్తులచే ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అర్చకులు సత్యశర్మచే మహిళలు సామూహిక వాసవీ వ్రతం చేపట్టి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం ఆర్యవైశ్య సభ అభివృద్ధికి సహకరించిన భక్తులను కమిటీ సత్కరించారు.

ఎర్రగుంట్ల..: ఎర్రగుంట్లలో వాసవీకన్యకాపరమేశ్వరీ దేవీ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారికి 52రకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. పుష్పాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తాదులకు అన్నప్రసాదాన్ని పంపిణీచేశారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు పట్టణంలో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. కన్యకాపరమేశ్వరీదేవి జన్మదిన మహోత్సవం ఆర్యవైశ్య సభ అధ్యక్షుడ మల్లెకొండు సుబ్రహ్మణ్యం కమిటీవారు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఉదయాన్నే ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలు పవిత్ర క్షీర కలశాలతోనూ, అమ్మవారికి వస్త్రాలు, పసుపు, కుంకుమ, వడిబియ్యంతోనూ పట్టణంలో ఊరేగింపు చేసి అమ్మవారికి సమర్పించారు. అనంతరం పాలాభిషేకం, పంచామృతాభిషేకం, అల్పాహార విందు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం మహామంగళహారతి, ప్రసాద వినియోగం, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎం.వెంగయ్య, కోశాధికారి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి రాజేంద్రగుప్త, ఉపాధ్యక్షుడు వంకధార నాగరాజు, సహాయ కార్యదర్శులు సత్యశివకుమార్, సురేష్‌గుప్త,సహాయ కార్యదర్శులు నల్లగట్ల సురేష్‌బాబు, కేకేపల్లె గంగాధర్, నూకల కులశేఖర్‌లతోపాటు మహిళలు పాల్గొన్నారు.



మైదుకూరు... ప్రత్యేక అలంకారంలో వాసవీమాత మూలవిరాట్







ప్రొద్దుటూరులో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం, ఎర్రగుంట్ల..అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, 52రకాల పిండి వంటలతో నైవేద్యం పెట్టిన దృశ్యం, జమ్మలమడుగు కన్యకాపరమేశ్వరీదేవి జయంతి వేడుకల్లో భక్తులు

చంద్రబాబును కలిసిన పుట్టా సుధాకర్‌యాదవ్



మైదుకూరు, మే 18 : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని స్థానిక టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ కలసి ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. శనివారం ఆయన హైదరాబాదులోని చంద్రబాబు నివాసానికి చేరుకొని పోలింగ్ రోజున జరిగిన సంఘటనలు, టీడీపీ ఏజెంట్లపైన వైసీపీ జరిపిన దాడులను చంద్రబాబుకు వివరించారు. టీడీపీ గెలుపు తథ్యమని వివరించారు. దాదాపు అరగంట పాటు తాజా రాజకీయాలపై చర్చించారు.

అర్హులైన పేదవారికి పట్టాలు ఇస్తాం

పోరుమామిళ్ల, మే 18 : అర్హతలు కలిగిన ప్రతి పేదవానికి ఇళ్ల పట్టాలు ఇస్తామని ఆర్డీవో వెంకటరమణ అన్నారు. శనివారం మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో సర్వే నెం.1008/2ఎలో స్థలాన్ని పరిశీలించి అక్కడ నివశిస్తున్న వారితో మాట్లాడారు. ఈ స్థలానికి సంబంధించి అబ్దుల్‌ఖాదర్ అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించడంతో ఆయన కోర్టు ఆదేశాల మేరకు తహసీల్దారు శిరీషతో కలిసి ఆ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో ఇంత వరకు ఇళ్లు కట్టారు. ఇక నుంచి ఇళ్లు కట్టవద్దని రెవెన్యూ సిబ్బంది కాలనీకి వచ్చి విచారణ జరుపుతారని ఆధార్‌కార్డు, వివరాలు ఇచ్చి సహకరిస్తే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లపట్టాలు ఇస్తామన్నారు. దళారులు,బోగస్ వారిని నమ్మి డబ్బులు ఇవ్వవద్దని అన్నారు. రెవెన్యూ అధికారులు వచ్చినప్పుడు సర్వేకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ఓబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర



కన్నెలూరు గంగమ్మ ఆలయం ఎదురుగా పొంగుపాలయాగం చేస్తున్న భక్తులు

జమ్మలమడుగు, మే 18: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో రెండవ రోజు శనివారం గంగమ్మ జాతర ఆవుల పబ్బం మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి తమ్ముళ్ల వేషదారణ నిర్వహించారు. పోతురాజులు గ్రామంలో తిరిగాయి. పుట్టబంగారం తెచ్చుట, నాగులకు పూజలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు గంగమ్మ దేవాలయం ఎదురుగా భక్తుల మధ్య పొంగుపాల యాగం నిర్వహించారు. సాయంత్రం షమీ వృక్షయాగం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మురుగునీటి సమస్యకు పరిష్కారం



మరమ్మతు చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, మే 18: తాగునీరు, బోరునీరు సరఫరా చేసే పైప్‌లైన్, గేట్‌వాల్వ్‌లు మురుగునీటిలో ఉన్న విషయాన్ని శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు శనివారం స్పందించారు. నగరపంచాయతి సిబ్బంది మురుగు నీటిని తోడేసి లీకేజీని అరికట్టారు. అలాగే పైప్‌లైన్, గేట్‌వాల్వ్ చుట్టూ మురుగునీరు చేరకుండా, పందులు అపరిశుభ్రం చేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ముగురునీరు కలుషితమౌతున్న మాట వాస్తవేనని, ఇకపై అలా కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

అలరించిన బండలాగుడు పోటీలు



బ్రహ్మంగారిమఠం, మే 18 : మండలంలోని కొత్తపల్లె గ్రామ సమీపాన నిర్మించిన లక్ష్మీ చెన్నకేశవ, అంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం స్వామివారికి పంచామృతాభిషేకం, అలంకారం, సహస్ర నామ పూజ, హోమాలు తదితర ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి రూ.లక్షను పుట్టా సుధాకర్‌యాదవ్ తరపున వారి అనుచరులు అందించారు. రెండో బహుమతి రూ.75వేలు చెన్నక్రిష్ణయ్యయాదవ్, మూడో బహుమతి రూ.50వేలు డొల్లు చెన్నయ్య, 4బహుమతి రూ.30వేలు కీ.శే.డి.పెద్దసుబ్బారెడ్డి కుమారులు, 5వబహుమతి 20వేలు డి.వెంకటసుబ్బారెడ్డి, రమణారెడ్డి, 6వ బహుమతి 10వేలు పుట్టా వెంకటస్వామి, 7వ బహుమతి రూ.5వేలు డి.రమణారెడ్డి (బుజ్జి) గెలుపొందినవారికి నగదు అందించారు. అనంతరం రాత్రి 8గంటలకు జొకుపల్లె గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆర్కెస్ట్రా పాటకచ్చేరి చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వారు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో చోరీ : నగదు అపహరణ

పోరుమామిళ్ల, మే 18 : పోరుమామిళ్లలోని దుండగులు చోరీకి పాల్పడి ఆ షాపుల్లో ఉన్న నగదు అపహరించారు. శుక్రవారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పోరుమామిళ్లలోని ఫ్రెండ్స్ సూపర్‌మార్కెట్, ఓంకార్ ఎలక్ట్రానిక్ షాపుల్లో చోరీకి పాల్పడి అక్కడ ఉన్న నగదును అపహరించారు. శనివారం ఉదయం షాపులు తెరిచిన వారికి తమ షాపుల్లో చోరీలు జరిగాయని గమనించి సమాచారాన్ని పోలీసులకు తెలిపారు. పోలీసు అధికారులు సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. ఓంకార్ ఎలక్ట్రానిక్స్ యజమాని వెంకటసుబ్బయ్య తన షాపులో దాదాపు రూ.90వేలు చోరీకి గురైందని, ఈ విషయం పోలీసస్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

రాజోలి ఆనకట్ట వద్ద 862 క్యూసెక్కులు వర్షం నీరు



రాజుపాలెం, మే 18 : ఎగువప్రాంతంలోని నంద్యాల జిల్లా ఆ పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షాలవల్ల కుందూలో వర్షం నీరు ప్రవహిస్తోంది. జిల్లా సరిహద్దులోని రాజోలి ఆనకట్ట నుంచి 862 క్యూసెక్కులు నీరు కుందూలోకి విడుదల చేస్తున్నట్లు సంబంధిత ఇరిగేషన్ అధికారులు తెలిపారు. వారం రోజుల క్రితం ఎండిన కుందూ ఇప్పుడు వర్షం నీటితో కళకళలాడుతోంది.

పచ్చిరొట్ట విత్తనాలు మంజూరు

అట్లూరు, మే 18 : అట్లూరు మండలంలోరైతులు ఖరీఫ్ సాగుకు పచ్చిరొట్ట విత్తనాలు మంజూరైనట్లు ఏవో రామక్రిష్ణ తెలిపారు. 50 శాతం సబ్సిడీతో జీలుగలు 55 క్వింటాళ్లు, జనుములు 20 క్వింటాళ్లు ప్రభుత్వం రైతులకు మంజూరు చేసిందన్నారు. రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకాలతో ఆర్బీకే కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. 10 కేజీల జనుముల ధర 880, 10 కేజీలు జీలుగల ధర రూ.880, రైతు వాటా 440 రూపాయలకు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు.

గోపవరం..: మండలానికి 41 క్వింటాళ్లు జీలుగలు, పది క్వింటాళ్ల జనుములు 50 శాతం రాయితీపై రైతులకు అందించేందుకు గాను ప్రభుత్వం వారు కేటాయించనున్నారు. విత్తనం కావాల్సిన రైతులు పట్టాదారుపాస్ పుస్తకం,ఆధార్‌కార్డుతో సంబంధిత ఆర్‌బీకేల్లోని వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని ఏవో రామక్రిష్ణ తెలిపారు. జీలుగలు పదికేజీల బ్యాగు పూర్తి ధర రూ.880 రాయితీ రైతు వాటా 440, జనుములు పదికిలోల బ్యాగు 880, రాయితీ 440, రైతు వాటా 440, విత్తనాలు కావాల్సిన రైతులు రైతు వాటాగా చెల్లించాల్సిన మొత్తం ఆర్‌బీకేలోని వ్యవసాయ సిబ్బందికి చెల్లించి వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణం

ప్రొద్దుటూరు టౌన్, మే 18: స్థానిక ఆర్టీపీపీ రోడ్డులోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో స్వామివారి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. శనివారం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయంలోని మండపంలో ఆశీనులను చేశారు. వేద పండితులు సుముహూర్తంలో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను రామేశ్వరం వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయం సత్యనారాయణ వ్రతం, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని భక్తులు పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

బ్రహ్మంగారి గ్రామోత్సవం

కలసపాడు, మే 18 : బ్రహ్మంగారి ఆరాధన సందర్భంగా శనివారం సాయంత్రం బ్రహ్మంగారి గ్రామోత్సవం కలసపాడు పురవీధుల గుండా విగ్రహాలను ఊరేగించారు. ఊరేగింపు వెంట తంబళ్లపల్లి గ్రామానికి చెందిన కోలాట బృందం అలరించింది. ముందుగా బ్రహ్మంగారి గుడి వద్ద తెల్లపాడు గ్రామస్తులచే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు సాదు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

శేష వాహనంపై అగస్త్యేశ్వరస్వామి ఊరేగింపు



ప్రొద్దుటూరు టౌన్, మే 18: అగస్త్యేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజు శేషవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం గంగరాజరాజేశ్వరి సమేత ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో దిగువ తంబళ్లపల్లె చిన్నారి ప్రతిభ

కలసపాడు, మే 18 : మండలంలోని దిగువతంబళ్లపల్లెకు చెందిన పల్లె ధృతి (8) జాతీయ స్థాయిలో రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభ కనబరిచింది. గురువారం గోవాలో జరిగిన జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్ 7, 9 కేటగిరిల్లో ఈ చిన్నారి జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సంపాదించింది. .

'ప్రవీణ్ రెడ్డిపై ఆరోపణలు సరికాదు'

ప్రొద్దుటూరు , మే 18 : ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌రెడ్డిపై కామిశెట్టి బాబు చేసిన ఆరోపణలు సరికాదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి పేర్కొన్నారు. శనివారం ప్రవీణ్‌రెడ్డి కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రవీణ్‌రెడ్డి నాలుగేళ్ళుగా పార్టీకోసం పనిచేశారన్నారు. సరైన సాక్ష్యాలు లేకుండా విమర్శించడం తగదన్నారు. ఎన్నికల సమయంలో ఏం జరిగిందో వరదరాజులరెడ్డి, ప్రవీణ్‌రెడ్డికి తెలుసు అన్నారు. ఇంకోసారి నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ రామసంజీవ్‌రెడ్డి, సుబ్బు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



ప్రొద్దుటూరు టౌన్, మే 18: గౌరమ్మకట్టవీధికి చెందిన కొవ్వూరు మనోజమ్మ తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె భర్త కొవ్వూరు సూర్యనారాయణరెడ్డి పేదలకు అన్నదానం చేశారు. శనివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కొవ్వూరు సూర్యనారాయణరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలను ప్రోత్సహించవద్దు

ప్రొద్దుటూరు క్రైం, మే 18 : ప్రొద్దుటూరులో ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఏ రాజకీయ పార్టీ సంబంధించిన వ్యక్తులు,అనుచరులు కానీ అనవసరంగా ఘర్షణలు పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మురళీధర్ హెచ్చరించారు. శనివారం డీఎస్పీ కార్యాలయం వద్ద ఎన్నికలు పూర్తయిన సందర్భంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐలు ప్రశాంత్, వెంకటరమణ, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం..: గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంత వరకు ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని రాజుపాలెం ఎస్‌ఐ తులసినాగప్రసాద్ తెలిపారు. ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ముఖ్యంగ సాయంత్రం వేళల్లో పల్లెల్లో ఐదారు గురు గుమికూడి రాజకీయం మాట్లాడకుండా ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా ఉండాలని ప్రజలకు సూచించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జమ్మలమడుగు, మే 18: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.భార్గవి సూచించారు. శనివారం జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి మాట్లాడుతూ 29న జరిగే లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జంబాపురం మహేశ్వరి, జాకీర్, సూర్యపెద్దిరాజు, భూతమాపురం సుబ్బారావు, భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఐ కల్పన, గ్రామస్థులు వి.పి.ఓ బుళరెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా

ఎర్రగుంట్ల, మే 18: ఎర్రగుంట్ల డిగ్రీ కాలేజీలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు ఏఐఎల్ డిక్సిన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు విద్యార్థులను ఇంటర్వ్యూ నిర్వహించారు. మొత్తం 57మంది విద్యార్థులు ఈ ఇంటర్వ్యూలో పాల్గొనగా అందులో 24మంది ఉద్యోగానికి ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవికుమార్ తెలిపారు. ఈకార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఈ.ఈశ్వర రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ సి.రామ మోహన్‌రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లల్లో మగ్గుతున్న జొన్నలు

ఆందోళనలో రైతులు



గోపవరం, మే 18 : పలువురికి పట్టెడన్నం పెట్టే రైతన్న పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. రైతు ప్రభుత్వమంటూ సీఎం జగన్ మొదలుకుని వైసీపీ నేతలు సొంత డబ్బా కొట్టుకుంటారు. కానీ రైతులను పట్టించుకోరు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల దశ మార్చాం, విత్తనాల నుంచి పురుగు మందులు, పండించిన ధాన్యాన్ని దళారీ వ్యవస్థ లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా కొంటామని చెప్పారు. కానీ అదంతా అవాస్తవమని క్షేత్రస్థాయిలో చూస్తే అర్థమవుతుంది. రైతు భరోసా కేంద్రాలు పేరుకే తప్ప వాటి వల్ల రైతులకు ఒరిగింది శూన్యమని రైతులు ఆరోపిస్తున్నారు. ఇంట్లో మగ్గుతున్న జొన్నలు కొనుగోలు చేయాలని నెలన్నర నుంచి రైతులు మొత్తుకుంటున్నా వారి మొర వినే నాథుడు లేడు. మేం కాదు.. మేం కాదు ఫలానా శాఖవారు కొంటారు అంటూ ఒకరిపై ఒకరు చెబుతూ తప్పించుకుంటున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు పంట అమ్ముకోలేక అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలోని బేతాయపల్లె, గడుసుపల్లె, మరికొన్ని గ్రామాల్లో జొన్న పంట వేసిన రైతులు ఈక్రాప్ కింద నమోదు చేసుకుని ప్రభుత్వం ద్వారా గిట్టుబాటు ధర కల్పిస్తామన్న అధికారులు పత్తా లేకుండాపోయారని రైతులు అంటున్నారు. ఈ విషయమై అధికారులను సంప్రదించగా మార్క్‌ఫెడ్ వారు కొని, వారు కొన్ని సాంకేతిక కారణాలతో కొనుగోలు చేయలేకపోయా రని, ముఖ్యంగా రకాల (వంగడాల) విషయంలో సమస్య ఉందని రైతులు సాగు చేసే రకాలు కొనుగోలు చేయ దానికి ఆస్కారం లేకపోవడంతో రైతులకు ఈ విషయం స్పష్టంగా తెలపడం జరిగిందని వారన్నారు. ఇంతకు ముందు పౌరసరఫరా శాఖ జొన్న రకాలతో నిమిత్తం లేకుం డా వారి లక్ష్యాల మేరకు కొనుగోలు చేయడం జరిగిందని వారన్నారు. ఇలా ఒకరిపై ఒకరు చెప్పుకోవడం వల్ల జొన్నలు ఇళ్లల్లోనే మగ్గి పోతున్నాయన్నారు.